# పిచ్చికుంట్ల సుబ్బడు

ఇదో...ఇట్టా ఎన్నెలకాసేతలికి యాడన్నా వుండనీ నాకు మావూరు గ్యాపకమొస్తాది. నేను మావూరిడ్సి రోంత తక్కువ నలభై ఏండ్లాయె. మావూర్లో వుండిన కాలంకంటే బైటుండిన కాలమే ఎక్కువయైపాయె. అయినాగానీ ఆ వూర్లో మాకేమన్నావుందా, ఎవరన్నా వుండారా అంటే, ఏమీల్యా. మా వూరు గుడకాశానా మారిపోయిందనీ, అప్పటోళ్లులేరు, అప్పటి వూరూ లేదని యింటి. నాకు మాత్రం ఆ మనుసులే, ఆ వూరే! అవులే, మారిపోయింది నేను సూల్లేదుగదా,నా కండ్లల్లో ఆ వూరుగాక యింగేముంటాది?

ఎన్నెలొస్తే మావూరు గ్యాపకమొస్తాదంటి.ఎన్నెలయావూరుమీద్దైనా కాస్తాదిగదా...నీకు మీవూరే ఎందుకు గ్యాపకమొస్తాది అంటే, వస్తాది అంతే, అదేగాదు, ఎన్నెలొస్తే మావూరు గ్యాపకమొస్తాదా,మావూరు గ్యాపకమొస్తే ఎన్నెలొస్తాదా...అనేదిగుడకా సెప్పలేను. అయితే ఒకిట్లే... ఎన్నెలొస్తే మా వూరు గ్యాపకమొచ్చేదే కరెక్టయుంటుంది. ల్యాకపోతే, మా వూరు గ్యాపకమొచ్చినప్పుడల్లా ఎన్నెలెట్టొస్తాది నా ఎర్రిగాలా! ఈ ఎర్రికాలిపోతే, ఇంగో ఎర్రివుంది. అందేంది అంటే, ఎన్నెల్లోనాకు కనిపిచ్చేది ఏందంటే పిచ్చికుంట్లసుబ్బడు.ఎవురికైనా ఎన్నెల్లోసెంద్రుడు కనపడ్తాడు కదా!నా కండ్లకు సుబ్బడు కనిపిస్తాడు. ఇదేంది అంటే, ఇదేందో అదేందో నాకు తెల్దు.వున్నే[1] సంగతి సెప్పడమే నాకు తెల్చు."వున్నే సంగతి అంటే ఏంది ? మీవూరు మారిపోయిందని నీకు తెల్చు అంటే,టీవీలు వచ్చుంటాయి.టీవీలో సిన్మాలూ, సీరియల్లూ సూస్తా వుండేవాళ్లు పిచ్చికుంట్లోల్ల కతలు యింటారా?" అనడగొచ్చు. దానికిసెప్తా. టీవీలో సిన్మాలూ, సీరియల్లూ నేనూ సూస్తావుండా.అయితే,నాకు పిచ్చికుంట్ల సుబ్బడు కతలుసెప్పడం ఎందుకు గ్యాపకం వస్తావున్నెట్టు? ఎన్నెలొస్తే, ఈ టీవీలల్లోకనిపిచ్చేవాళ్లెవరూ గ్యాపకం రాకుండా సుబ్బడే ఎందుకు కనిపిస్తావున్నెట్టు?" ఎందుకంటే...నీకు పిచ్చి. పిచ్చోడివి గనుకనే పిచ్చికుంట్లోల్ల గురించి సెప్తావుండావు'' అంటారా! అట్టనే.నాదిపిచ్చే.పిచ్చికుంట్లోల్లకతలు పిచ్చియే.టీవీల్లో ఎన్నో పిచ్చిసిన్మాలూ,సీరియల్లూ సూస్తావుంటారు. ఇది యిన్లేరా! అయి సూడాల, యినాల.నాది యినడమే యిని. యేయి పిచ్చియో సెప్పండి.

సరిగ్గా పంట కల్లాల్లోకి వచ్చేతలికి పిచ్చికుంట్లోల్లు వూల్లోకి దిగుతారు.కల్లాల్లోకి వచ్చేతొలిపంట కొర్రపంట.అందుకే రైతులు వాళ్లను సూస్తానే నగుతా "కొర్రలు దెంకపోడానికికొచ్చినారా" అనడుగుతారు."మీదగ్గర కొండబోక[2]పోతే మేమెట్టాబతకాలమల్ల" అంటారు వాళ్లు. అట్టని పిచ్చికుంట్లోల్లు ఆరుగాలమూ అడుక్కునేవాళ్లుగాదు."మీ దగ్గర అడుక్కోవాల.మేం బతకాల" అనిగుడకా అంటారు. ఇప్పుడు అడుక్కొని తీసకపోయినవాటితోనే ఏడాది పొడుగునా బతకలేరు.వాళ్లూ కాయకస్టంజేసుకుని బతకాల.ఎకరమో, ఎకరన్నరో బూముంటే పండిచ్చుకోవాల.మల్లెందుకు అట్ల అంటారు అంటే, అది ఎప్పట్నించో వున్న కట్టుబాటు.రైతులకు గోత్రాలు సెప్పాల.కతలు సెప్పాల.రైతులు ఇచ్చింది తీసకపోవాల.

నేను సూడబట్టేతలికే పెదసుబ్బడు ముసలి సుబ్బడై,సినసుబ్బడుపెదసుబ్బడయిపోతావుండె.వాళ్ల

1) వుండిన (ఇంతకు ముందూ, ఇప్పుడూ వున్న) 2) తీసుకపోక

ఆడోళ్ల పేర్లు ఎట్టుంటాయో అంతబాగా తెల్దు కానీ మొగోళ్ల పేర్లల్లొ ఎక్కవుగా 'సుబ్బడు' వుంటాడు. సుబ్బని కొడుకు సినసుబ్బడు. సినసుబ్బని కొడుకు పిల్లసుబ్బడు. ఇట్టగాక అట్టయితే,సినసుబ్బడు పెదసుబ్బడయితే, పెదసుబ్బడు ముసిలి సుబ్బడయితాడు. ఒకనికి ఒక్కడుగాక ఇద్దరుముగ్గురు పుడితే,అప్పుడు నడిపి సుబ్బడు,సంటి సుబ్బడు. ఇట్టాల్యాకపోతే, ఎర్రగావుంటే ఎర్రసుబ్బడు,నల్లగావుంటే నల్లసుబ్బడు,బక్కగావుంటే బక్కసుబ్బడు. ఎట్టుంటే అట్ట సుబ్బడు.

వూర్లోకి దిగుతానే పెద సుబ్బడూ, సినసుబ్బడూ తలకాయలకు ఎర్రరుమాలు సుట్టుకోని, ఇరుపక్కలా బుజాలుదిగి నడుములకాడికొచ్చేట్టుగా పైపంచెలేసుకోని, గంటలు వాయిచ్చుకుంటా యింటింటికీ తిరిగి, ఎవురెవురి గోత్రాలు వాళ్లకు గ్యాపకం సేస్తారు. అప్పటికి శాళ్లొచ్చినట్టు వూరంతటికీ తెలుస్తాది."అయితే రాత్రికి కతవుంటాదన్నమాట" అనుకుంటారు. ఆ రాత్రయి, పెద్దరుగు బయల్నుంచి గుమ్మెత 'గుమ్, గుమ్, గుమిక్ గుమిక్' అని యినిసిస్తానే, ఇండ్లల్లొవాళ్లకు లోపల 'గుమ్‌గుమ్' అన్నెట్టే వుంటాది. అప్పటికే పిల్లోళ్లు బువ్వల్దిని అడుకొంటా వున్నోళ్లు ఒక్కసారిగా పెడిశల[1] మాదిరి ఎగిరిపోయి వాళ్లసుట్టూ వాల్తారు. కల్లాల్లోకిపోయే మొగోల్లకు బువ్వలు పెడ్తానే,బయల్న మంచాలెయ్యమని ఆడోళ్లు జీతగాళ్లకుసెప్తారు.జీతగాళ్లక్కూడా బువ్వలుపెట్టి,వాళ్లుతిని,వక్కాకు[2] నముల్తా ఆడోళ్లు వచ్చే సరికి,రోంత సేపు కతయిని కల్లాలోకి పోదామనుకున్న మొగోళ్లు దుప్పట్లు కప్పుకుని,బీడీలు తాగుతా అరుగుమీన కూచ్చోని వుంటారు. కత రోంతయిని పోదామనుకున్నోళ్లు ఒక్కోసారి కథసాలిచ్చేదాకా కదలకుండా కూచ్చోని వుంటారు.

బయలు మజ్జిన సంచి పట్టలు పర్సుకోని కూచ్చోని,ముసిలి సుబ్బడు ఆర్మోని[3] పెట్టి బూరగ[4] పోస్తావుంటాడు.ముసిలి సుబ్బని కోడలు సినసుబ్బని పెండ్లాం గుమ్మెతకొడ్తాది. సిన సుబ్బడు కతగాడు కాకముందు ఈ ముసిలి సుబ్బడు కతజెప్తే, ఆయన పెండ్లాం సిన సుబ్బని అమ్మ గుమ్మెత కొట్టేదంట. ఆమె సచ్చిపోయినాక గుమ్మెత కోడలికొచ్చింది. పార్తన పూర్తిజేసి,గజ్జెలు ఘల్లు ఘల్లుమనిపిస్తా సిన సుబ్బడు లేస్తాడు. తలకాయకు తెల్లటి రుమాలు సుట్టుకోని,సేతిలో సేతెడు పొడుగు టేగా[5] పట్టుకోని, పంచె సైకిల్ కట్టుకోని,మోకాళ్లకాడికుండే వొదులొదులు సొక్కాతొడుక్కోని వుంటాడు.టేగాకు పిడికాడ గజ్జెలుంటాయి. ఎన్నెలగుడకా కత యిందామని ఆదరాబాదరా వచ్చినట్టు,పెన్నేటి మీదుగా పరుగెత్తుతావచ్చి బయలంతా పర్సుకొని వుంటాది.

ఏకత సెప్పమంటారని సినసుబ్బడు సబాసదుల్ని అడుగుతాడు. ఆడోళ్లు బాలనాగమ్మ కతసెప్పమంటే, మొగోళ్లు పల్నాటి యుద్దం సెప్పమంటారు. కొందరు కుంటిమల్లారెడ్డి కత సెప్పమంటారు.ఒక్కోటి వరసగా అందరు కోరిన కతలూ సెప్తానని,అందరికీ దండాలు పెట్టి సెప్తాడు సుబ్బడు. ఈ కతలు యేటా యినేటియే. అయినా, ఎప్పటికప్పుడు కొత్తగా యిన్నెట్టే వుంటాయి. కత సెప్తా వుండేతప్పుడు సిన సుబ్బడు సేసేటియిగుడకా యెప్పుడూ సూసేటియే.అయినా యింగా యింగా సూడబుద్దయితానే వుంటాది. పిడికాడ[6] వుండే గజ్జెల్ని ఘల్‌ఘల్‌మనిపిస్తాటేగాని ఎనక్కీ ముందుకూ సాపుతా ఎగిరి దూకుతాడు. ఇంగోపారి[1] అబ్బాలం[2] తిరిగినట్టు సుట్టూ తిరుగుతాడు. అప్పుడు

1) ఒకరకం గువ్వలు 2) తాంబూలం 3) హార్మోనియం 4) శ్రుతి 5) ఖడ్గం

వొదులొదులు సొక్కా శత్రీ[3] మాదిరి యిచ్చుకుంటాది. పిల్లి అడుగులేస్తా నడుస్తాడు., ఆ యెంటనే కుప్పిచ్చి దూకుతాడు. ఇట్టా సిత్రాలూ,సిత్తారీలూ[4] సేస్తాడు. పెదసుబ్బడూ,కోడలూ యెప్పటికప్పుడు వుశారిస్తా బల్ కొడతావుంటారు.

"మీ దగ్గర అడుక్కోవాల,మేం తినాల" అని వాళ్లనిగదా,కతసెప్పేటప్పుడు అట్ట అనిపిచ్చనే అనిపిచ్చదు. అసలు వాళ్లు అడుక్కునే వాళ్లుకాదు.,"మేం కతసెప్పాల,మీరు యినాల" అనేట్టుంటాది. మల్లా వాళ్లను పగులుసూసినామంటే ఎట్టుంటారు? నిద్దరమొకాలేసుకుని,సోంబేర్లాల[5] వుంటారు. బువ్వల్దినేప్పుడు కూరాకు నాకు తక్కువయిందంటే నాకు తక్కువయిందని కొట్లాడుకుంటా వుంటారు. అప్పుడుగానీ,వాళ్ల యెవారం సూస్తే,యెవురికైనా 'సీ...సీ...'అని సీద్దరం [6] పుడ్తాది.

రాత్రిపూట కతసెప్పటానికి కూచ్చున్నప్పుడు,యీళ్లు పగులు జూసిన మనుసులుకాదనిపిస్తాది. అట్టుంటారు. కూరాక్కోసం కొట్లాడుకున్నట్టుండదు. అసలు వాళ్లకు తిండికన్నా కత సెప్పడమే ముక్యమన్నెట్టుగా కనిపిస్తారు. అందుకోసరం పుట్నెట్టుగా అగుపిస్తారు. పిచ్చికుంట్లోల్లంటే అదీ మల్ల!

---

1) సారి 2) గుండ్రంగా తిరుగుతూ పిల్లలు ఆడే ఆట 3) గొడుగు 4) విన్యాసాలు
5) సోమరుల మాదిరి 6) చీదర